రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్, డివిజన్ కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే సమస్యకు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

జాతీయ విద్యా విధానంతో పాఠ్య ప్రణాళికలు

● ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షావలి ఖాన్



మాట్లాడుతున్న ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షావలి ఖాన్

కర్నూలు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు రూపొందించాలని ఉర్దూ యూనివర్సిటీ వీసీ పీఎస్ షావలి ఖాన్ అన్నారు. శనివారం డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీలో హైబ్రిడ్(ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో కంబైండ్ బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానాన్ని అనుసరిస్తూ యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ కోర్సుల్లో పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి సబ్జెక్టులో యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ, యూజీసీ నెట్ సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని రూపొందించడంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. యూనివర్సిటీలో రూపొందించిన పాఠ్యప్రణాళికలను రాష్ట్ర ఉర్దూ అకాడమీ సహకారంతో ఉర్దూ మాధ్యమంలో అనువదించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని వివిధ శాఖల బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్లు, సభ్యులు, సిబ్బందికి ఉపకులపతి సూచించారు. ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి



మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

ఓర్వకల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికడదాం అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మి శిక్షణా భవనంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి హాజరయ్యారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, దళితులపై అత్యాచారాలు, కులదూషణలు, దాడులను అరికట్టాలంటే చట్టాలపై అవగాహన తప్పనిసరిగా పెంచుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ఉమెన్ అండ్ సేల్డ్ వెల్ఫేర్, వైద్య ఆరోగ్యశాఖ కమ్యూనిటీ డెవలప్మెంట్ తదితర స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీ నిర్మల, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధిక, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ హుశేనయ్య, సీనియర్ న్యాయవాది జయరాజ్, మానసిక నిపుణుడు సుమంత్, ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ సతీష్, ఎస్ఐ సునీల్‌కుమార్, ఎంఈవో ఓంకార్ యాదవ్, వెల్ఫేర్ ఆఫీసర్ శారద, ఐసీడీఎస్ సీడీపీవో అనూరాధ, డాక్టర్ అరుణ, ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడులో ఉద్రిక్తత

వెలుగోడు పట్టణంలో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా గణనాథులను జమ్మినగర్‌తండా సమీపంలో గాలేరు నదిలో నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్లలో ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈక్రమంలోనే ఓ ప్రార్థనా మందిరం వద్ద డప్పులు వాయిస్తూ ఊరేగింపుగా వెళ్లేందుకు ఓ వర్గం వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. హుటాహుటిన కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, ఏఎస్పీ యుగంధర్ వెలుగోడుకు చేరుకున్నారు. ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. ఈక్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఓ వర్గానికి చెందిన వారంతా వినాయక విగ్రహాలను ట్రాక్టర్ ట్రాలీల్లోనే ఉంచి వాటిని ఎక్కడికక్కడే రోడ్లపై నిలిపివేసి ఇంజన్లను తీసుకెళ్లారు.

● ఆత్మకూరు/ వెలుగోడు(ఆంధ్రజ్యోతి)



శుక్రవారం అర్ధరాత్రి రోడ్లపైనే వినాయక విగ్రహాలను నిలిపి ఉంచిన దృశ్యం



పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న హైందవ సంఘాల ప్రతినిధులు

● వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ
● రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
● తరలివచ్చిన హైందవ సంఘాల ప్రతినిధులు
● పోలీస్‌స్టేషన్ ఎదుట 8గంటలు బైఠాయింపు
● అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు
● పరిస్థితిని పర్యవేక్షించిన డీఐజీ, ఎస్పీ
● ఎట్టకేలకు ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

భారీ బందోబస్తు మధ్య ఊరేగింపు



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా వెలుగోడుకు చేరుకుని డప్పు వాయిద్యాల నడుమ వినాయక ఊరేగింపునకు అనుమతించారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య వినాయక ఊరేగింపు కొనసాగించి జమ్మినగర్ తండా సమీపంలోని గాలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ శోభాయాత్రకు వెలుగోడుతో పాటు ఇతర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. మొత్తానికి నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులతో పాటు ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇతర గ్రామాల ట్రాక్టర్ ఇంజన్‌లను..

పోలీసులే స్వయంగా ఇతర గ్రామాల ట్రాక్టర్ ఇంజన్‌లను తెప్పించి ఆయా ట్రాలీల్లోని వినాయక విగ్రహాలను బోయరేవుల సమీపంలోని గాలేరు నదిలో శనివారం తెల్లవారుజామున నిమజ్జనం చేశారు. ఆ తర్వాత ఆ ట్రాక్టర్ల ట్రాలీలన్నీ ఓ ప్రైవేట్ పాఠశాల ప్రాంగణంలో నిలిపివేశారు. ఈ విషయం విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, వినాయక ఉత్సవ సమితిల దృష్టికి వెళ్లడంతో ఆయా సంఘాల నాయకులు వై.విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరయ్య, కమ్మయ్య, భూమా రాజశేఖరరెడ్డి, చిలుకూరి శ్రీనివాసులు, నిమ్మకాయల సుధాకర్ ఉదయాన్నే వెలుగోడుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వినాయక మంటపాల నిర్వాహకులు, ఓ వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో స్థానిక పోస్టాఫీసు నుంచి పోలీసుస్టేషన్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. సుమారు 11గంటల సమయంలో పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎవరు అడ్డొచ్చినా తాము వినాయక విగ్రహాలకు నిమజ్జనం చేసి తీరుతామని భీష్మించారు. అయితే అనుమతులు ఇచ్చే అంశం తమ పరిధిలో లేదని కలెక్టర్, ఎస్పీలను సంప్రదించాలని స్థానిక పోలీసు అధికారులు వారికి చెప్పడంతో ఆయా సంఘాల ముఖ్య నాయకులు నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. అయినప్పటికి ఓ వర్గానికి చెందిన ప్రజలు రాత్రి 7గంటల వరకు స్టేషన్ ఎదుటే ధర్నా కొనసాగించారు. మధ్యాహ్నం అక్కడే భోజనం చేయడంతో పాటు సాయంత్రం వర్షం దంచికొట్టిన అక్కడి నుంచి కదల్లేదు. ఈక్రమంలోనే నిమజ్జనం చేసి తీరుతామంటూ ఓ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో పోలీసు స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. బీజేపీ నాయకులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని సమస్య పరిష్కారం కోసం చర్చించారు.



భారీ పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనం

పోలీసుల అత్యుత్సాహంతోనే..



వెలుగోడుకు చేరుకున్న భద్రతా దళాలు

వెలుగోడులో చోటు చేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు పోలీసుల అత్యుత్సాహంతోనే జరిగిందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం వెలుగోడుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టంలో ఎక్కడా ప్రార్థనా మందిరాల వద్ద మేళతాళాలు ఆపాలని లేదన్నారు. హిందూ సమాజం ఇతర మతాలను ఎప్పుడు గౌరవిస్తుందని, వారి ప్రార్థనలు జరుగుతున్నప్పుడు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా గౌరవించే ఆచారాన్ని ఎప్పటికీ ఆచరిస్తామని గుర్తుచేశారు. ఇక్కడ ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం సిగ్గుచేటని అన్నారు. వీటిపై ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు కూడా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురికావొద్దని హెచ్చరించారు.

రేపు ఐఐఐటీ డీఎంలో ఇస్రో ప్రదర్శన

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో జగన్నాథగట్టుపై ఉన్న ఐఐఐటీ డీఎంలో సోమవారం ఇస్రో స్పేస్ ఆన్ వీల్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ రాజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో అంతరిక్ష యంత్రాలు, నమూనాలు, అనువర్తనలను ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు. అంతరిక్ష శాస్త్రంలో భారతదేశం సాధించిన విజయాలను వివరిస్తారని రాజ్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఇస్రో ప్రదర్శనలను సందర్శించవచ్చని కోరారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు

• హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
• మొదటి దశలో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి సేకరణ

7

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

• ప్రణాళికతో చదివి విజయం సాధించాలి
• పిల్లల చదువును మధ్యలో ఆపరాదు
• ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ
• డీఎస్పీ అభ్యర్థులకు ఘన సన్మానం

7



మాట్లాడుతున్న ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరగనుందన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్ల నియామకాన్ని చేపట్టి వారికి శిక్షణ కూడా పూర్తి చేశామన్నారు. అలాగే రాజకీయ పార్టీలు కూడా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని శిక్షణ ఇవ్వాలని సూచించారు. 1200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో కొత్తగా 237 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇప్పటికే 2,203 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలను కలిపితే మొత్తం 2,440 కేంద్రాలు అవుతాయన్నారు. కొత్తగా ప్రతిపాదించిన పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటు, స్థాన మార్పు, నామకరణ మార్పు మొదలైన వాటికి సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే.. నేరుగా ఈఆర్వో లేదా జిల్లా ఎన్నికల అధికారికి ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, టీడీపీ పార్టీ ప్రతినిధి ఎల్‌వీ ప్రసాద్, బహుజన సమాజ్‌వాద్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి అరుణ్‌కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరుపున బజారన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి హాజరయ్యారు.

లాటరీ పద్ధతిన 19 బార్లు ఎంపిక



టెండర్ ప్రక్రియలో కొత్త బార్ పాలసీని ప్రకటిస్తున్న జేసీ, డీసీ, ఈఎస్

● 7 బార్లకు ముందుకు రాని యాజమాన్యాలు
● 83 దరఖాస్తులతో రూ.4.15 కోట్ల ఆదాయం
● ఇద్దరు మహిళలను వరించిన లాటరీ
● పెండింగ్ బార్ల రీనోటిఫికేషన్‌కు అవకాశం
● జేసీ, డీసీ, ఈఎస్ ఆధ్వర్యంలో ముగిసిన ప్రక్రియ

కర్నూలు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కొత్త బార్ పాలసీని జాయింట్ కలెక్టర్ బి. నవ్య లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి. శ్రీదేవి, సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు అధ్యక్షతన ఎంపిక ప్రక్రియ జరిగింది. ఉదయం 8 గంటలలోపే జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బార్ల యాజమాన్యాలు జిల్లా పరిషత్ ఆవరణానికి చేరుకున్నాయి. 26 బార్లకు లైసెన్స్ జారీ కోసం నోటిఫికేషన్ జారీ చేయగా అందులో 3 బార్లను గీత కులాలకు కేటాయించారు. కర్నూలు నగరంలో 16 బార్లకు గాను 12, ఆదోనిలో 4, గీత కులాలకు సంబంధించి కర్నూలు-2, ఆదోని-1కి సంబంధించి 83 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 4.15 కోట్ల ఆదాయం సమకూరింది. లాటరీ ప్రక్రియను సీఐ రాజేంద్రప్రసాద్ టోకెన్ పద్ధతిన లబ్ధిదారులకు చదివి వినిపించగా సూపరింటెండెంట్ ఎం. సుధీర్‌బాబు బాక్స్‌లో వేసిన కాయిన్స్‌ను జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఎంపిక చేయించారు. జనరల్ కేటగిరీలో ఆదోనిలో వెల్లాల లలితమ్మ, గీతకులాల జాబితాలో కర్నూలు నగరానికి ఆస్పరి రజిత ఎంపిక కావడంతో వారికి రెండు బార్లను కేటాయించారు. కాగా కర్నూలు-4, ఎమ్మిగనూరు-2, గూడూరు-1 బార్లకు సంబంధించి ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో మరోసారి 7 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు తెలిపారు.

గణనాథుడి వైభోగం

● కొనసాగుతున్న గణేశ్ ఉత్సవాలు



కర్నూలు శ్రీనివాస్‌నగర్‌లో రాధాకృష్ణుల రూపంలో దర్శనమిస్తున్న గణనాథుడు



కర్నూలు ధర్మపేటలో..

తుంగభద్ర తీరం

సాహిత్యం

సమకాలీన రాజకీయాలను చూపే
పదవి మూలం ఇదం జగత్

నేడు టీజీవీ కళాక్షేత్రంలో పుస్తక సమీక్ష



కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమకాలీన రాజకీయాలకు, నేతల మనోభావాలకు నిలువుటద్దంగా 'పదవి మూలం ఇదం జగత్' పుస్తకం నిలుస్తుంది. కర్నూలుకు చెందిన సుప్రసిద్ధ నాటక దర్శకుడు, నటుడు, కవి కళారత్న పత్తి ఓబులయ్య 'ధనం మూలం మిదం జగత్తన్న' సూక్తిని, అధికార హోదాను కైవసం చేసుకొని పెత్తనం వెలగబెడుతున్న కొందరు నేతల తీరును అన్వయిస్తూ 'పదవి మూలం.. ఇదం జగత్ పలుకు నిజము' పేరుతో 216 తేటగీతి పద్యాలతో కూడిన పుస్తకాన్ని రచించారు. అధికారం ఉన్నప్పుడు, ఊడిన తర్వాత ఉన్న ఇరు పార్శ్వాలకు ముఖచిత్రం ఇది. సమకాలీన రాజకీయాల్లో అగ్ర రాజ్యాధినేతల నియంత వైఖరిని నిరసించడంలో కూడా ఓబులయ్య పద్యాలను గమనించవచ్చు. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే అవినీతిపరుల కన్నా, కోట్లాది ప్రజల అభిమాన ధనాన్ని కొల్లగొట్టే జననేతలకే జనం నిత్యం హారతులు పడతారంటూ 'కోట్లు వెనకేసి నీతికి తూట్లు బొడిచి జైలు పాలైన నేతల చరిత'ను చూడమంటారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాసేవే ఏకైక మార్గం అన్న సదాభిప్రాయంతో రాసిన ఈ పద్య రచన పత్తి ఓబులయ్య 12వ సృజన. గెలిచిన నేతను భుజాల పైకెత్తి మోసేవారే గానీ, ఓటమితో కుంగిపోయే వాడి భుజం



తట్టేవారెవ్వరూ ఉండరన్న వాస్తవాన్ని చిత్రిస్తూ 'ఓడిపోయిన నేతల నాడి తెలిసి ఒంటరితనాన్ని ఓదార్చువారు లేరు.. రాజకీయాల నిజమిది వసుధయందు' అంటారు. మాతృభాషకు పట్టిన దురవస్థను, కరువు కాటకాలతో రాళ్లు తేలిన సీమను సైతం తన పద్యాల్లో రచయిత ప్రస్తావించారు. తెలుగు జాతికి అవిరామసేవలను సల్పిన మహనీయులను తలచుకుంటూ, రాయలవారి మొదలు నందమూరి తారక రాముని వరకు సందర్భసహితంగా కొనియాడారు. ఆదివారం ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పుస్తక సమీక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇది త్వరలో అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులోనికి రానుంది.

కళాకారుల సరికొత్త రికార్డు

- 24 గంటల నిర్విరామ నాటక ప్రదర్శనలు
- ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



'పదవి మూలం ఇదం జగత్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్ తదితరులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం నిర్వహించిన ఏకపాత్ర నాటక పోటీలు ఘనంగా ఆరంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త రికార్డు సృష్టించేలా అత్యధికమంది కళాకారులతో 24 గంటల పాటు నిర్విరామ పద్య నాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం శ్రీకారం చుట్టింది. ఈ పోటీలను శనివారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత బీవీ రెడ్డి, మాంటిస్సోరి, రవీంద్ర విద్యాసంస్థల అధినేతలు కేఎస్‌వీ రాజశేఖర్, జి.పుల్లయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు చైర్మన్ వెంకటాచారి ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి గిడుగు రామమూర్తి, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాల్లో 24 గంటలపాటు ఏకపాత్ర నాటక పోటీలను నిర్విరామంగా కొనసాగించడం, దాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు వారు నమోదు చేయడం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఇదే తొలిసారి అన్నారు. ఇదొక ప్రయోగాత్మక ప్రక్రియ అన్నారు. ఆధునిక కాలంలో రంగస్థల నాటకాలపై ఆదరణ తగ్గిపోతున్న తరుణంలో ఇలాంటి కార్యక్రమాలు కళాకారులకు మరింత ఉత్సాహాన్ని పెంచుతాయని కళాక్షేత్రం నిర్వాహకులను అభినందించారు. 82 మంది కళాకారులు ఇప్పటి వరకు నమోదు చేసుకొని కళాప్రదర్శనలకు ముందుకు



పోటీల్లో పాల్గొన్న కళాకారుడు

రావడం అభినందనీయమన్నారు. తెలుగు నాటక రంగ చరిత్రలో టీజీవీ కళాక్షేత్రం పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు చైర్మన్ వెంకటాచారి మాట్లాడుతూ కళాకారులు 24 గంటల పాటూ ఏకధాటిగా ఏకపాత్ర నాటక ప్రదర్శనలు చేయడం ఎక్కడా నమోదు కాలేదన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు భోజన సౌకర్యం కల్పించామని, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదుకు గ్రామీణ ప్రాంత కళాకారులకు చక్కటి అవకాశం లభించినట్లయిందని అన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న కళాకారులను ప్రశంసాపత్రాలు, శాలువా , జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పి.రాజరత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ మియా, కేవీ రమణ, ఎర్రమ పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, సంగా అంజనేయులు, కదిరి రమేష్ పాల్గొన్నారు.

పుస్తక ఆవిష్కరణ: టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య రచించిన 'పదవి మూలం ఇదం జగత్' (అధికారము') పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ప్రతులను ఆయన పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు జి. పుల్లయ్య, కేఎస్‌వీ రాజశేఖర్, ఇతర కళాకారులకు అందజేశారు. పదవిలో ఉన్న సమయంలో, ఆ పదవి లేని సమయంలో రాజకీయ నేతల మనోభావాలను చక్కగా తెలియజేశారని పత్తి ఓబులయ్యను ఆయన అభినందించారు.

డీఎంఈగా డాక్టర్ రఘునందన్



కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా డాక్టర్ జి.రఘునందన్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య అదనపు ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీఎంఈ డాక్టర్ నరసింహం ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి డీఎంఈగా డా.జి.రఘునంద్‌ను నియమించారు. ఆయన సొంత ఊరు అనంతపురం జిల్లా గుత్తి పట్టణం. 1994 కడపలో సురభి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 1996 ఎస్వీ మెడికల్ కాలేజీ తిరుపతిలో ఆర్థోపెడిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 1997 కర్నూలు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2015లో ప్రొఫెస ర్‌గా 2021లో కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2022 అనంతపురం మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీగా, 2022 అక్టోబరులో అనంతపురంలో జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, 2023 జూలై నుంచి విజయవాడలో అడిషినల్ డీఎంఈగా, వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా నియమితులయ్యారు.

కళ

సైరా శామ్యూల్

పౌరాణికాల్లో రాణిస్తున్న హోంగార్డు



నారద పాత్రలో శామ్యూల్



- రంగస్థల కళా ప్రవీణుడిగా గుర్తింపు
- రెండు నందులతో పాటు అవార్డులెన్నో సొంతం
- పద్యం, నాటకమే ఆయనకు ప్రాణం
- కళారంగంలో చిరుద్యోగి శామ్యూల్ ప్రతిభ

పద్యం తెలుగువారి సొత్తు. పౌరాణిక పద్య నాటకం తెలుగువారి వైభవం. అలాంటి పౌరాణిక పద్య నాటకాన్ని కొత్త ఒరవడితో, నూతన ఆలోచన పోకడలతో ప్రేక్షక జనరంజకంగా ఆడుతూ.. నటుడిగా పాడుతూ నాటక సమాజంలో బహుముఖ పాత్రలు పోషిస్తున్నాడు కర్నూలు నగరానికి చెందిన రెడ్డిపోగు శామ్యూల్. ఓ వైపు పద్య నాటకాలతో పాటు మరో వైపు ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ తనదైన శైలిలో రాణిస్తున్నారు ఆయన. కృషి ఉంటే మనుషులు రుషులు అవుతారన్న నానుడికి ఆయన చక్కని ఉదాహరణగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే నంది అవార్డు, ఉగాది పురస్కారాలతో పాటు ఎన్నో అవార్డులు, సత్కారాలు ఆయన సొంతమయ్యాయి. ఎన్నో బహుమతులు అందుకున్నా, కీర్తి కిరీటాలు వచ్చినా 'విద్య యొసగును వినయంబు' అన్న రీతిన ఆయన నడుచుకుంటారు. తన మాటల్లోనూ, చేతల్లోనూ అహంభావం, అహంకారం వీసమెత్తు కూడా ప్రదర్శించని ఆయన.. సంస్కారాన్ని ఆభరణంగా మార్చుకుని ఆయన సాంఘిక, పద్యనాటకాల్లో రాణిస్తున్నారు. 'సైరా నరసింహారెడ్డి' నాటకంలో ఆయన పోషించిన పానకాలు పాత్రను చూసిన వీక్షకులకు పూనకాలు రావాల్సిందే. అందుకే ఆయన్ను అందరూ 'సైరా శామ్యూల్' అంటుంటారు.

కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆయన గొంతు నుంచి జాలువారే పద్యాలు ఆయన ధరించిన పాత్రకే కాదు... ఆ నాటకానికి కూడా వన్నె తెచ్చిపెడతాయి. ఒక నాటకంలో ఆయన వేసే పాత్ర ఏదైనా కావచ్చు, కానీ ఇతర పాత్రలను మించిన గొప్ప నటనతో ఆకట్టుకుంటున్నారు హోంగార్డు ఆర్.శామ్యూల్. సాంఘిక నాటకమైనా, పౌరాణిక నాటకమైనా, తను ధరించే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకులను అసాంతం కట్టిపడేసే అభినయం ఆయన సొంతం. జిల్లా నాటక రంగంలో ప్రత్యేకించి నారద పాత్రలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర, గుర్తింపు తెచ్చుకుంటున్నారు ఆర్.శామ్యూల్. వృత్తిరీత్యా హోంగార్డుగా కర్నూలు యూనిట్‌లో పనిచేస్తున్నా.. ప్రవృత్తి పరంగా సాంఘిక, పౌరాణిక పద్య నాటక కళాకారునిగా రాణిస్తున్నారు. చేసేది చిరుద్యోగమే అయినా, ప్రవృత్తి పరంగా నాటక రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. పద్య నాటక రంగానికి పురిటిగడ్డగా నిలిచే కందనవోలులో ఎందరో ఔత్సాహిక యువతకు నాటక రంగంలో మార్గదర్శకంగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నంది నాటక పోటీల్లో ఇటీవలే రెండు నంది బహుమతులు సాధించిన శామ్యూల్, వివిధ పరిషత్తులు నిర్వహించిన జాతీయ స్థాయి నాటక పోటీల్లోనూ బహుమతులను జిల్లా కళారంగానికి తెచ్చిపెడుతున్నారు.

నంద్యాల జిల్లా మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన రెడ్డిపోగు పక్కీరమ్మ, రెడ్డిపోగు నాగన్న కుమారుడు శామ్యూల్ ఇంటర్ వరకు చదువుకున్నారు. 1987లో ఏడో తరగతి చదివే రోజుల్లో మేనమామ ప్రోత్సాహంతో 'పల్నాటి యుద్ధం' బుర్రకథలో కథకుడిగా తొలిసారి రంగస్థలంపై కాలు మోపారు. 1992లో ఇంటర్ సెకండియర్ చదువుతూ ప్రభుత్వం చేపట్టిన 'నిరక్షరాస్యత నిర్మూలన' ప్రచార కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు. సుమారు 30కి పైగా గ్రామాల్లో పర్యటిస్తూ అక్షరాస్యత ఆవశకతపై అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఉన్నత చదువుకు కర్నూలు వచ్చి మేనమామ సుందర్‌రావు ఇంట్లో ఉంటూ, ఆయన ప్రోత్సాహంతో నాటక రంగంపై మమకారం ఏర్పడింది. ఆయన తన ఇంట్లోనే ఒక సంగీత గురువును ఏర్పాటు చేసి, హార్మోనియం వాయిస్తుండగా పద్యాలు ఎలా పాడాలో నేర్పించారు. 1995లో ఏప్రిల్ 24న మేనమామ సుందరరావు కుమార్తె సుభాషిణిని వివాహం చేసుకున్నారు. ఆమె స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఇద్దరు ఆడపిల్లల్లో మహిత ఇంటర్ పూర్తిచేసిన నీట్‌కు సిద్ధం అవుతుండగా, రిషత ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.



సై సైరా నరసింహారెడ్డి నాటకంలో పానకాలుగా..

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం

2002లో కర్నూలు యూనిట్‌లో హోంగార్డుగా ఉద్యోగానికి శామ్యూల్ ఎంపికయ్యారు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూనే తీరిక సమయాల్లో పద్య నాటకాలను ప్రదర్శించేవారు. శామ్యూల్‌లోని రంగస్థల నటన ఆసక్తిని గుర్తించిన మామ, విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ బీఆర్ సుందర్‌రావు ప్రోత్సహించారు. అనంతరం టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య సహకారం నాటక రంగంలో శామ్యూల్‌కు కీర్తికిరీటాన్ని తెచ్చిపెట్టింది. ఆయన సహకారంతో 2002లో 'శ్రీకృష్ణ తులాభారం' నాటకంలో నారదుడి పాత్రతో తానేంటో నాటక ప్రపంచానికి తెలియజేశారు. 2002లో నాటి జిల్లా పోలీసు అధికారులు ఫ్యాక్షన్ నిర్మూలన, అంధ విశ్వాసాల నిర్మూలనపై 'కనువిప్పు' అనే సాంఘిక నాటకాన్ని గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. 2009 వరకు 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కూడిన బృందంలో శామ్యూల్ రైతు పాత్రలో ఈ నాటకంలో మెప్పించాడు. 250కి పైగా ఈ నాటకాన్ని గ్రామాల్లో ప్రదర్శించారు.



పోలీసు శాఖ ప్రదర్శించిన కనువిప్పు నాటకంలో రైతు పాత్రలో (మధ్యలో వ్యక్తి)

సొంతమైన అవార్డులు

- 2002లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ నంది నాటక పోటీల్లో 'శ్రీకృష్ణాభిమన్యు' నాటకానికి నారద పాత్రకు నంది పురస్కారం.
- 2013లో 'బభ్రువాహన విజయం' నాటకానికి విజయనగరంలో జరిగిన నాటక పోటీల్లో నంది బహుమతి.
- 2014లో 'శ్రీకృష్ణాభిమన్యు' నాటకానికి నారద వేషానికి ప్రత్యేక బహుమతి.
- 2015లో 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటాభిమానానికి ఇంద్రుని పాత్రకు బహుమతి.
- 2016లో 'ప్రమీలార్జున పరిణయం' నాటకానికి ఉత్తమ సహాయనటుడిగా అవార్డు.
- 2017లో 'సై సైరా నరసింహారెడ్డి' చారిత్రక పద్య నాటకంలో పానకాలు పాత్రకు ఉత్తమ సహాయ నటుడి అవార్డు.
- 2018లో ఉగాది పురస్కారం.



మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ..(ఫైల్)

కళాకారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కళారంగంలో రాణించే వారు అహర్నిశలు శ్రమిస్తూ తమకు ప్రత్యేక గుర్తింపు రావాలని కోరుకుంటారు. ఇది సహజమే. కానీ అదే సమయంలో తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అందుకు ఉదాహరణగా నన్ను నేను చెప్పుకుంటాను. 2024 డిసెంబర్‌లో హై బీపీ వల్ల మెదడు రక్తనాళాలు గడ్డకట్టి కోమాలోకి వెళ్లిపోయా. ఆరోగ్యంగా ఉంటే బీపీ, షుగర్ మాత్రలు వేసుకోవాల్సిన అవసరం లేదని ఎవరో ఏదో చెబితే నమ్మి అలసత్వం వహించాను. దానికి పెద్ద సమస్యనే ఎదుర్కోవాల్సి వచ్చింది. బీపీ, షుగర్ ఉంటే కచ్చితంగా మందులు వాడాల్సిందే. అలాగే వైద్యుల పర్యవేక్షణలో వాటిని వేసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన విషయాన్ని కళాకారులు విస్మరించకూడదు. - ఆర్.శామ్యూల్



నాటి ఎస్పీ ఆకె రవికృష్ణ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న శామ్యూల్ దంపతులు(ఫైల్)

శ్రీశైలం భద్రతపై ఆక్టోపస్ బృందంతో సమావేశం



నంద్యాల కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో భద్రతాపరమైన అంశాలకు సంబంధించి శనివారం దేవస్థాన కార్యాలయంలో ఆక్టోపస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవో శ్రీనివాసరావు, ఆక్టోపస్ విభాగం డీఎస్పీలు తిరుపతయ్య, సుంకురయ్య, అధికారులు, స్థానిక తహసీల్దారు శ్రీనివాసులు, సీఐ ప్రసాదరావు, ప్రొటెక్షన్ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారి, విద్యుత్ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానంలో చేపడుతున్న భద్రతా చర్యల గురించి పీపీటీ ద్వారా వివరించారు. అలాగే దేవస్థానంలోని క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, శివరాత్రి, ఉగాది ఉత్సవాలలో ఏర్పాటు చేయనున్న అదనపు క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాల గురించి వివరించారు. దేవస్థానంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీస్, సంబంధిత అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఆక్టోపస్ బృందం వారు భద్రతాపరమైన అంశాలకు సంబంధించిన మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

9న జిల్లా స్థాయి మారథాన్

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఎయిడ్స్‌పై అవగాహన కోసం సెప్టెంబరు 9న జిల్లాస్థాయి మారథాన్ ద్వారా 5కి.మీ. పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా.శారదాబాయి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజకుమారి అనుమతితో 9వ తేదీ ఉదయం 6 గంటలకు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఈ పరుగు పోటీ ప్రారంభమవుతుందన్నారు. ఈ పోటీ కళాశాల బ్రిడ్జి వద్ద నుంచి చామకాల్వ, మున్సిపల్ ఆఫీస్, పద్మావతినగర్, టెక్కె మీదుగా జీజీహెచ్ వరకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు నంద్యాల జిల్లా వాసులై ఉండాలని, 17నుంచి 25 సంవత్సరాల వయసుగల విద్యార్థినీ, విద్యార్థులు, యువతీయువకులు, పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు కూడా పాల్గొనవచ్చని వివరించారు. గతంలో జిల్లా స్థాయిలో బహుమతి పొందినవారికి ప్రవేశంలేదన్నారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7వేలు మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్స్ మూడు విభాగాల్లో ఈ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు.

గణనాథుడి వైభోగం

- కొనసాగుతున్న గణేశ్ ఉత్సవాలు
- నేడు పలు ప్రాంతాల్లో నిమజ్జనం



ప్రకాశ్‌నగర్‌లో కొలువైన వినాయకుడు




కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం వినాయక మండపాల్లో స్వామివారి ప్రత్యేక పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం పలు వినాయక మండపాల వద్ద భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు నగరంలో రాంబోట్ల దేవాలయం, కుమ్మరి వీధి, చిత్తారివీధి, జమ్మిచెట్టు, అమ్మవారిశాల, పూలబజారు, పాతబస్టాండు, ఎన్‌ఆర్‌పేట, కొత్తపేట, సంకల్‌బాగ్, ధర్మపేట శ్రీనివాసనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. అలాగే మండపాల వద్ద చిన్నారులు పలు దేవతామూర్తుల వేషధారణలో చేసిన నృత్య రూపక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి భజన మండళ్ల ఆధ్వర్యంలో భజలు, భక్తి పాటల కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు నిమజ్జనం : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో శనివారం నిమజ్జన వేడుకలు జరగనున్నాయి. నంద్యాలలో ఆదివారం జరిగే నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షించారు. నంద్యాల గాంధీ చౌక్‌లో గణేశ్ కేంద్ర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత సభను నిర్వహిస్తున్నట్లల నిర్వాహకులు తెలిపారు. నంద్యాలలోని చిన్న చెరువు కట్ట సమీపంలో ప్రత్యేక పోలీసులతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను మళ్లించారు. నిమజ్జనం కోసం భారీ క్రేన్లను తరలించారు.



సంకల్ భాగ్‌లో కొలువైన గణ నాథుడు



ప్రకాశ్‌నగర్‌లో కొలువైన గణనాథుడు



నంద్యాల చెరువుకట్ట వద్ద నిమజ్జనానికి సిద్ధంగా ఉంచిన క్రేన్‌లు

చదువుతోనే అభివృద్ధి సాధ్యం


డీఎస్సీ అభ్యర్థులను సన్మానిస్తున్న ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

- ప్రణాళికతో చదివి విజయం సాధించాలి
- పిల్లలు చదువును మధ్యలో ఆపరాదు
- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ
- డీఎస్సీ అభ్యర్థులకు ఘన సన్మానం

దేవనకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏ గ్రామం అయినా అభివృద్ధి చెందాలంటే అది చదువుతోనే సాధ్యమని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. శనివారం ఆయన కప్పట్రాళ్ల గ్రామానికి వచ్చారు. ముందుగా తానా భవనం నుంచి కల్యాణ మండపం చేరుకొని సమావేశంలో మాట్లాడారు. 2006లో కోల్‌కత్తాలో ప్రైవేట్ జాబ్ చేస్తుండగా తాను ఐపీఎస్ ఎంపికైనట్లు వచ్చిన ఆనందం కంటే, తన దత్తత గ్రామం కప్పట్రాళ్లలో మెగా డీఎస్సీలో ఏడుగురు ఉద్యోగాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తనకు మొదట బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం వచ్చిందని, విధులు నిర్వహిస్తూనే ప్రణాళికతో చదివి విజయం సాధించానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువు మధ్యలో ఆపకూడదన్నారు. నేడు ఏడుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని, రాబోయే పదేళ్లలో ఈ సంఖ్య వందకు చేరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా కప్పట్రాళ్ల నుంచి జాతీయ అవార్డులు వస్తాయని ఆశా భావం వ్యక్తం చేశారు.

డీఎస్సీలో ఎంపికైన రామకృష్ణ, శ్రీరాములు, రాజేశ్వరి, రామానాయుడు, రామాంజినేయులు, ఉత్తేజ్‌గౌడ్, శ్రీరాములు 2018 డీఎస్సీ అభ్యర్థులు శ్రీరాములు, బడేసాబ్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. రవికృష్ణ పుట్టిన రోజు సందర్భంగా గ్రామస్థులు ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేశారు. వాల్మీకి చైర్‌పర్సన్ బొజ్జమ్మ, సర్పంచ్ చెన్నమ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రూపమ్మ, సీఐ వంశీనాథ్, ఏవో అక్బర్, గ్రామస్థులు మల్లి కార్జున, చింపి ఈరన్న, ఎల్ఐసీ రాజు, సేక్రీస్ కోఆర్డినేటర్ నారాయణ పాల్గొన్నారు.

పట్టుదల ఎక్కువ



కప్పట్రాళ్ల గ్రామస్థులకు పట్టుదల ఎక్కువ. అనుకుంటే ఏదైనా సాధిస్తారు. విద్యలో రాణించి, గ్రామానికి మరింతగా మంచి పేరు తీసుకురావాలి. రవికృష్ణ సార్ ప్రోత్సాహంతో మరింత ముందుకు వెళ్తాం. **- రాజేశ్వరి, డీఎస్సీ అభ్యర్థి**

మార్పు మా నుంచే..



గ్రామాభివృద్ధికి మార్పు అనేది మా నుంచే మొదలు కావాలి. రవికృష్ణ సార్ కృషి అభినందనీయం. ఆయన సహకారం మరవలేనిది. గ్రామాభి వృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు. **-మర్యాద రామకృష్ణ, డీఎస్సీ అభ్యర్థి**

పర్యాటకులకు కనీస వసతులు కల్పించలేరా..

- బెలుం గుహల సిబ్బందిపై మంత్రి బీసీ ఆగ్రహం

కొలిమిగుండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల్లో పర్యాటకులకు కనీస వసతులు కల్పించలేరా.. అంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బెలుం గుహలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుహల పరిసరాలు, గుహల ఆవరణంలోని చిరు దుకాణాల్లోని పదార్థాలను మంత్రి పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంపై గుహల యూనిట్ మేనేజర్ జి.కిశోర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ, విదేశీ పర్యాటకులు సందర్శించే పర్యాటక కేంద్రం లో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని గుర్తుచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి

మహిళ ఆత్మహత్య

దేవనకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెడుబుడకల గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. పెద్దకడుబూరు మండలం జాలవాడికి చెందిన వడ్డె పరమేష్, పద్మ దంపతుల కుమార్తె వడ్డె పద్మ(27)ను, దేవనకొండ మండలం, జిల్లెడుబు డకల గ్రామానికి చెందిన బాలకృష్ణకు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే సంతానం కలగకపోవంతో భర్త కుటుంబ సభ్యులు వేధించేవారు. వీరి వేధింపులు తాళలేక పద్మ శుక్రవారం క్రిమిసంహార మందు తాగింది. ఆమెను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా : వృద్ధురాలి మృతి

బనగానపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో శివమ్మ (68) దుర్మరణం చెందింది. ఎస్ఐ దుగ్గిరెడ్డి వివరాల మేరకు... జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియానికి చెందిన శివమ్మ, తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనమద్దిలేటి స్వామి దర్శనానికి సొంత ఆటోలో బయలుదేరారు. కటికవాని కుంట వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో శివమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆటోలో ఉన్న మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వాగులో పడి యువకుడు..

కోవెలకుంట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లంపాడు, లింగాల గ్రామాల మధ్య ఉన్న చిన్నవంచన వాగులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలరాంపూర్ జిల్లా గొండిపూర్ గ్రామానికి చెందిన లవకుశ, మహమ్మద్ షాకీర్ నంద్యాలలో నివాసం ఉంటూ చిన్నకొప్పెర్ల గ్రామంలో ఓ ఇంటికి పీవోపీ పని చేసేశారు. ఈ మేరకు పది రోజుల నుంచి మోటారు బైకుపై పనికి వచ్చి వెళుతుండేవారు. ఇందులో భాగంగా శనివారం కూడా నంద్యాల నుంచి బైకుపై ఆ ఇద్దరూ వస్తుండగా చిన్నవంచన వాగు వద్ద బైకు అదుపుతప్పి వాగులో పడింది. బైకు వెనుక కూర్చున్న లవకుశ (16) వాగులో పడి గల్లంతయ్యాడు. మహ్మద్ షాకీర్ గ్రామస్థులకు సమాచారం అందించాడు. వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఐ భూపాలుడు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ, తహసీల్దారు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో గల్లంతైన యువకుడిని బయటికి తీసేందుకు ఈతగాళ్లను పిలిపించి గాలించారు. లవకుశ మృతదేహాన్ని, బైకును ఈతగాళ్లు బయటికి తీసుకువ చ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన అందనం విజయరాజు(59) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు... కోవెలకుంట్ల పట్టణానికి చెందిన అందనం విజయరాజు ఈ నెల 25న రోడ్డు ప్రమాదం లో గాయపడ్డారన్నారు. కోవెలకుంట్లలోని ఓ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి..

సంజామల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నుంచి నంద్యాలకు ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ శనివారం తెల్లవారుజామున ప్రమాదానికి గురై డ్రైవర్ మృతి చెందిన సంఘటన పేరుసోమల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణయ్య వివరాలు మేరకు.. కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లెకు చెందిన గోగుల సూరీడు (47) తాడిపత్రిలో ట్రాక్టర్‌కు ఇసుక నింపుకొని నంద్యాలకు వెళుతుండగా పేరు సోమల - రెడ్డిపల్లె మధ్యలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సూరీడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించామని ఆయన తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ న్నారు. కాగా సూరీడికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నట్లు ఆయన వివరించారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

సి.బెళగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి కొత్తకోట విద్యుత్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు సుందరయ్యనగర్‌కు చెందిన 13 మంది యువకులు నిమజ్జనం పూర్తయిన సందర్భంగా సుంకేసులకు విందు చేసుకోవడానికి ఆటోలో బయలుదేరి వెళ్లారు. అక్కడ ఫుల్‌గా మద్యం తాగి తిరుగు ప్రయాణం అయ్యారు. కొత్తకోట విద్యుత్ కార్యాలయం దగ్గర రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఏడుగురికి గాయాలు కాగా నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. కొత్తకోటకు చెందిన హరి, శ్రీనివాసులు అంబులెన్స్‌కు ఫోన్‌చేసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యూరియా పంపిణీలో ఘర్షణ

దొర్నిపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయంలో శనివారం యూరియా పంపిణీలో ఘర్షణ చోటు చేసుకుంది. కొండాపురం గ్రామానికి 55 యూరియా బస్తాలు మంజూరయ్యాయి. రైతులకు ఒక్కొక్క పాసు పుస్తకానికి రెండు బస్తాల ప్రకారం అందించాల్సి ఉంది. అయితే గ్రామంలో ఓ వ్యక్తికి 10 బస్తాలు అందించారని రైతులు సచివాలయం వద్దకు వచ్చి వీఏఏ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో వీఏఏపై గొడవపడ్డారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో సావిత్రి, ఏవో ప్రమీల, ఇన్‌చార్జి ఎస్ఐ రామిరెడ్డి సచివాలయం వద్దకు వెళ్లి విచారించారు. అధికారులపై గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.2 లక్షల నగదు అపహరణ

- కేసు నమోదు

కోవెలకుంట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో ఓ వ్యక్తి తన మోటారు బైకు సైడు బ్యాగులో ఉంచిన రూ. రెండు లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు..

ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నెకు చెందిన ఉబ్బరి క్రిష్టుడు శుక్రవారం కోవెలకుంట్లకు వచ్చి స్టేట్ బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టి రూ.2లక్షలు డబ్బు తీసుకుని మోటారు బైకు సైడ్‌బ్యాగులో పెట్టుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలో బైకు ఆపి వేరే వారితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అనంతరం క్రిష్టుడు ఇంటికెళ్లి చూడగా డబ్బు లేకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సి.బెళగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మీదేవి, రుద్రయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు చందు(19). శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తుండగా క్రిష్ణదొడ్డి రోడ్డులో వినాయక విగ్రహానికి విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యుల అందజేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


చందు(ఫైల్)

గణపతి మండపం దగ్ధం

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు గ్రామం రజకుల వీధిలో ఏర్పాటు చేసిన గణపతి మండపం దగ్ధమైంది. శుక్రవారం సాయంత్రం గణపతి నిమజ్జనం అనంతరం అర్ధ రాత్రి నిప్పు అంటుకొని కాలిపోయింది. అందులో ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. అందులో ఉన్న ఫర్నిచర్, స్పీకర్లు, మైకులు, షామియానా తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని స్థానికులు తెలిపారు. కాగా ఇది ప్రమాదవ శాత్తు జరిగిందా.. లేదా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా అన్నది తెలియాల్సి ఉంది.


కాలిపోయిన మండపం

అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ


మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో ఆ యూనియన్ జిల్లా స్థాయి వర్క్‌షాపు జిల్లా అధ్యక్షురాలు బి.రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసినా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా, విన్నపాలు అందజేసినా పరిష్కరించడం లేదన్నారు. పనిభారానికి కారణమైన యాప్‌లను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకురాళ్లు బాలదుర్గమ్మ, శైలజ, ప్రభావతమ్మ, వరలక్ష్మి, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన దివ్యాంగ అభ్యర్థులకు శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో సర్టిఫికెట్లను వైద్యులు పరిశీలించారు. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన వారు ఈ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ఈఎన్‌టీలో అనంతపురం జిల్లా నుంచి ఆరుగురు, కర్నూలు జిల్లా నుంచి 18 మంది, కడప జిల్లా నుంచి 13 మందికి ఈఎన్‌టీ వైద్యులు రీవెరిఫికేషన్ చేశారు. ఇక ఆర్థోపెడిక్‌లో లాకోమేటర్ కింద కర్నూలు జిల్లాలో 28 మందికి మానసిక విభాగంలో కర్నూలు జిల్లాలో 1, అనంతపురంలో నలుగురికి వైద్యులు ఎంపికైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పరిశీలించారు.

శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ ఇంద్రేష్ శనివారం రాత్రి స్వామివారిని దర్శించుకున్నారు. మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, శ్రీపతి ఆచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. అనంతపురాణిక్, మల్లిఖార్జున స్వామి, అనంతస్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ ఉన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు


కోడుమూరు మండలం వర్కూరులో పొలంలోనే ఉల్లి పంట

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- మొదటి దశలో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి సేకరణ

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా గ్రామాల్లోనే రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజుతో కలిసి శనివారం కర్నూలు జిల్లాలోని పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని ఉల్లి పండించిన గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. క్వింటం ఉల్లికి గిట్టుబాటు ధర రూ.1,200 అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో దాదాపు 5వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని నిల్వ చేసేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములతో పాటు మార్కెట్ కమిటీ యార్డుల పరిధిలోని గోదాములను సిద్ధం చేస్తున్నారు. ఉల్లి పంటను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.



'శుభప్రద'కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెంచర్లు వేసి వినియోగదారులకు సేవాలోపం చేసిన శుభప్రద వెంచర్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. 2020 జూన్ నెలలో స్థానిక కల్లూరులోని సర్వే.నెంబర్లు 37, 38, 49లో శుభప్రద పేరుతో ఓవెంచర్ వేశారు. ఆవెంచర్‌లో తుగ్గలి మండలం ఆర్ఎస్ గ్రామానికి చెందిన ఫిర్యాది దూదేకుల హుసేన్‌బీతో పాటు మరో 28 మంది రూ.4.85లక్షలు చెల్లించి ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ వెంచర్ వేయకుండే నేషనల్ హైవే ఈ వెంచర్ గుండా చెన్నయ్ సూరత్ గ్రీన్ హైవే చేయడానికి భూసేకరణ ప్రకటన ఇచ్చారు. ఈ భూసేకరణలో బాగంగా శ్రీశుభప్రద వెంచరులోని 60 ప్లాట్లు కూడా పోవడం జరిగింది. అయితే ప్లాట్లు కొనుగోలు చేసినవారికి భూమి కన్వర్షన్ జరగకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టం జరిగింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు శుభప్రద వెంచర్‌పై ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే కాకుండా ప్లాట్లు వేయడమే కాక వెంచర్‌లో నుంచి హైవే వెళ్తున్న విషయాన్ని కూడా దాచి పెట్టి తమకు సేవాలోపం చేశారని జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసు విచారించిన కమిషన్‌ను శుభప్రద వెంచర్‌వారు వినియోగదారులకు సేవా లోపం చేయకుండానే కాకుండా అక్రమంగా వాణిజ్యానికి పాల్పడినట్లు నిర్ధారించింది. దీంతో ఒక్కో ప్లాటు యజమానికి రూ.2లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.5వేలను ఫిర్యాదుదారులకు 45 రోజుల లోపు చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ బిల్లు కేంద్రాల్లో సేవలు

కల్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం విద్యుత్ బిల్లు చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయని ఆశాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆదివారం తమ సమీపంలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో సేవలు యథావిధిగా పనిచేస్తాయని, విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లులు చెల్లించాలని సూచించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన



ప్రసంగిస్తున్న సీబీఐ జిల్లా న్యాయాధికారి శోభారాణి

కర్నూలు కల్చరల్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎస్సీ, ఎస్టీ చట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు కేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కర్నూలు సీబీఐ జిల్లా న్యాయాధికారి శోభారాణి హాజరై మాట్లాడారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, పీసీఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టుపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబరు డా.రాయపాటి శ్రీనివా సులు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చటరీత్యా నేరమన్నారు. కార్యక్ర మంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ జీవీ రంగారెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎస్.శైలజ, తెలుగు అధ్యాపకులు జయ సుశీల, కల్పన, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కర్నూలు క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. శనివారం స్థానిక దూపాడు వద్ద అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమానికి ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో అనే పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ హనుమంతరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డ్రగ్స్ రమాదేవి, అశోకా గ్రూప్స్ సీఈవో హరికృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్.నవీన్, ఈగల్ టీం పోలీసు అధికారులు, సీఐ ప్రసాద్, ఎస్ఐ సుజన్ కుమార్ పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసులకు సన్మానం

కర్నూలు క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పని చేసి పదవీ విరమణ పొందిన పోలీసులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ సన్మానించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పీసీఆర్ ఎస్ఐ పి.నిర్మలదేవి, ఏఆర్ ఎస్ఐ పీబీ పురుషోత్తంలను శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారు తమ కుటుంబాలతో సంతోషంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఏఆర్ డీఎస్పీ బాస్కర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ కేశవరెడ్డి, ఆర్ఐ నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

ప్రియాశెట్టిని అభినందించిన టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు చెందిన ప్రియాశెట్టిని శనివారం నగరంలో స్థానిక మౌర్యఇన్‌లోని తన కార్యాలయంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ టెలివిజన్ షో బిగ్‌బాస్‌లో నగరానికి చెందిన ప్రియాశెట్టి చోటు సాధించేలా ప్రతి ఒక్కరూ ఆమెకు ఓటు వేయాలని సూచించారు. ప్రియాశెట్టి మాట్లాడుతూ తనను టీజీ వెంకటేశ్ ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు..

దుకాణాల వేలానికి స్పందన కరువు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని నిర్వహించిన మున్సిపల్ దుకాణాల వేలాలకు స్పందన కరువైంది. శనివారం స్థానిక ఎస్‌బీఐ కాలనీ కౌన్సిల్ సమావేశ భవనంలో నిర్వహించిన వేలంలో మొత్తం 37 దుకాణాలకు వేలం నిర్వహించారు. అయితే.. కేవలం ఒకే ఒక దుకాణం శ్రీనివాస థియేటర్ మాత్రమే నలుగురు దరఖాస్తులు చేసుకున్నారు. మిగిలిన దుకాణాలకు ఒక్కరూ మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో కమిషనర్ రెవెన్యూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత దుకాణాలకు ఎందుకు మరమ్మతులు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన మరమతులు చేసి మరోసారి వేలానికి ఆహ్వానించాలని పేర్కొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులను సన్మానించిన దృశ్యం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని టౌన్ మోడల్ పాఠశాలలో తైక్వాండో క్రీడాకారులకు ఏర్పాటు చేసిన అభినందన సభకు జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు హాజరై సన్మానించారు. అనంతరం హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో తృతీయ స్థానం సాదించి బ్లాక్ బెల్ట్ టీఎం హరిప్రియను, అలాగే వచ్చే నెల జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే బి.కార్తీక్, టీఎం గాయత్రీలను సన్మానించారు. తైక్వాండో ఇన్‌చార్జి కార్యదర్శి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

భౌ.. భయం



● రెచ్చిపోతున్న శునకాలు ● చిన్నారులపై దాడులు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు
● ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కుక్కల బెడద అధికమైంది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. గ్రామ సింహాల సంచారం అధికమైంది. వీటి బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంకు ప్రతిరోజు కుక్కలను నిరోధించి కాపాడాలని ఫోన్లు వస్తున్నాయి. విఠల్‌నగర్‌లో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తుందని, దారిలో వచ్చిపోయే వాళ్లను కుక్కలు బెదిరిస్తున్నాయని, వాటి నుంచి ప్రజలను కాపాడాలని స్థానికుడు కమాండ్ కంట్రోల్ రూంకు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. దీంతో పాటు వివిధ కాలనీల నుంచి కూడా కుక్కల సమాహంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల నరసింహరెడ్డి నగర్‌లో ఓ చిన్నారిని కుక్క కాటు వేయడంతో గాయాలు పాలైనట్లు స్థానిక కార్పొరేటర్ కౌన్సిల్ సమావేశంలో మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకురావడం కొసమెరుపు.

ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే..

పలు కాలనీల్లో కుక్కలు అధిక సంఖ్యలో స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. స్థానిక కొత్తపేట సమీపంలోని తేజ అపార్ట్‌మెంట్ వద్ద కొందరు సుమారు నాలుగైదు కుక్కలను ఇంటి ముందు పెంచుతున్నారు. దీంతో రాత్రిపూట అటుగా వెళ్లే ప్రజలు ప్రాణాలను అరచేతిలో వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా రాత్రిళ్లు విధులు నిర్వహించేవారు, ఇళ్లకు వెళ్లేవారికి అవి ప్రాణ సంకటంగా మారాయి. ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లో ఇద్దరు చిన్నారులు కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వ



ఆసుపత్రిలో చికిత్స పొందిన సంఘటనలున్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని చిన్నారుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళ ప్రధాన రహదారుల్లో..

రాత్రివేళ ప్రధాన రహదారుల్లో కుక్కలు గుంపులు..గుంపులుగా ఉంటూ వాహనదారులు, పాదాచారులకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్కోసారి వాహనం మీద వెళ్లేవారిపై దాడికి పాల్పడుతున్న సంఘటనలు నగరంలో పలుచోట్ల చోటుచేసుకున్నాయి. పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. నగరంలోని 52 వార్డులలో సుమారు 6లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు తక్షణమే స్పందించి కుక్కలను నిరోధించి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులపై కార్పొరేటర్ల అసహనం

ఈ నెల 25న జరిగిన కౌన్సిల్ సమావేశంలో కుక్కల నియంత్రణపై కార్పొరేటర్లు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నగరంలో కుక్కలను నియంత్రించడంలో అధికారులు వైఫల్యం చెందారని కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 52 వార్డుల్లో నాలుగేళ్ల కాలంలో ఎన్ని కుక్కలను పట్టుకున్నారు? ఎన్నింటికి ఆపరేషన్ చేశారు? వాటి వివరాలు వార్డుల వారీగా ఇవ్వాలని కమిషనర్ ఆదేశించినా అధికారులు ఇప్పటివరకు ఇవ్వకపోడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

పట్టుకెళ్లి ఆపరేషన్ చేస్తున్నాం

నగరంలో కుక్కలను పట్టుకెళ్లి ఆపరేషన్ చేస్తున్నాం. ఫిర్యాదు వచ్చిన ప్రతి చోట స్పందించి కుక్కలను తీసుకెళ్తున్నాం. పట్టుకెళ్లిన కుక్కలను కేవలం ఆపరేషన్ చేసి వదలాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఉంది. ఆపరేషన్ చేయడంతో కుక్కల్లో ఉండే శక్తి సన్నగిల్లుతుంది. వాటిని చంపే అధికారం చట్టపరిధిలో లేదు. అందుకే వాటిని పట్టుకెళ్లి ఆపరేషన్ చేసి వదిలేయాలని కోర్టు నుంచి ఆదేశాలున్నాయి.

● మల్లన్న, పశువైద్యాధికారి, నగరపాలక సంస్థ, కర్నూలు

హంద్రీ నీవా కాలువకు ఎమ్మెల్యే జలహారతి



జలహారతి ఇచ్చి నదీమతల్లికి నమస్కరిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం పి.రుద్రవరం సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువకు శనివారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి జలహారతి ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ లోని ఉమ్మడి చిత్తూరు జిల్లాల ప్రజల దశాబ్దాల కల సాకారమైందన్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణానది జలాలు చేరుకున్నాయని ఈసందర్భంగా సీఎం చంద్రబాబు కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారని ఎమ్మెల్యే వివరించారు. ఈనేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గంలో కూడా హెచ్ఎన్ఎస్ కాలువకు జలహారతి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. 14 నెలలోనే సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువలను ఆధునీకరించి దాదాపు 730కిలోమీటర్ల వరకు రాయలసీమలో నాలుగు జిల్లాలకు కృష్ణాజలాలను పారించి రైతులకు సాగునీరు అందించి భగీరథుడయ్యారన్నారు. తద్వారా దాదాపు రూ.6లక్షల ఎకరాలకు సాగునీరు అందించి హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమ చరిత్రలో చంద్రబాబు నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గణనాథుడు ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం సమాచార శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయ గణపతిని కలెక్టర్ దర్శించుకుని పూజలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గణనాథుని ఆశీర్వాదాలతో ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పాత్రికేయ ఉత్సవ గణపతి సమితి సభ్యులు కలెక్టర్‌ని సన్మానించారు. కలెక్టర్‌తోపాటు సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె.జయమ్మ, పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా బాధితులకు వరం

ఓర్వకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క టీడీపీ సభ్యత్వం ఉన్న వారికి ప్రమాద బీమా వరం లాంటిదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని కురువ చిన్నస్వాములు అనే వ్యక్తి ఇటీవల పాము కాటుతో మృతి చెందాడు. చిన్నస్వాములు టీడీపీ సభ్యుడిగా ప్రమాద బీమా చేసుకున్నారు. అయితే ఆ కుటుంబానికి రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య లక్ష్మీదేవికి ఎమ్మెల్యే గౌరు చరితా, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఏసేపు, వేణుగోపాల్ రెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబు, కురువ నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దారెడ్డి మృతి

కర్నూలు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ప్రధాన కార్యదర్శి తెర్నేకల్ కె.పెద్దారెడ్డి అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలియగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన పార్థీవ దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు రఘునాథ్ టాకిస్ వద్దగల శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని ఆయన సోదరుడు వెంకటరెడ్డి పేర్కొన్నారు.

విభాగాల మధ్య సమన్వయం అవసరం

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నగరంలో సమస్యల పరిష్కారానికి విభాగాల మధ్య సమన్వయం అవసరమని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం కమిషనర్ పెద్దమార్కెట్, వినాయక ఘాట్ వద్ద మున్సిపల్ దుకాణాలు, పరిసర ప్రాంతలు, కిడ్స్ వరల్డ్ వద్ద డ్రైనేజీ కాలువ ఓవర్‌ఫ్లో సమస్యలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో అవసరమైన మరమ్మతు పనులను ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

'సీమ'ను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

● సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం
● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
● కృష్ణమ్మకు జలహారతి

కల్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాగు, సాగునీటి ప్రాజెక్టులను వరద జలాలతో నింపి కరువు సీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ బ్రాంచ్ కెనాల్ వద్ద ఎమ్మెల్యే జలహారతిలో పాల్గొన్నారు. కృష్ణానది జలాలను విడుదల చేసిన చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే గౌరు చరిత ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. గౌరుచరిత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రతిపాదికన పూర్తికి చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ, ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాం జనేయులు, ఉలిందకొండ సింగిల్‌విండో అధ్యక్షుడు ఈవీరమణ, మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, వాకిటి మాదేష్, ధనుంజయ, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

మెగా డీఎస్సీ ఘనత కూటమి ప్రభుత్వానిదే..: రాష్ట్రంలో మెగా డీఎస్సీ విడుదల చేసి యువతీ, యువకులకు టీచర్లుగా ఉద్యోగం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వా నిదేనని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శనివారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరిత ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పందిపాడుకు చెందిన ముగ్గురు వలంటీర్లు డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు పొందిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మల్లెల రాజశేఖర్, యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, శేఖర్, నాగిరెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న నోడల్ ఆఫీసర్ రఘు

ఓర్వకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. డాక్టర్ రఘు మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిలు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే బేటీ బచావో.. బేటీ పడావో అనే నినాదంతో ఆడ పిల్లలను రక్షించాలని కోరారు. ఆరోగ్య అధికారి రాధామోహన్, నర్సులు సైజన్య, ఉమా రాణి, పర్యవేక్షకురాలు ఎస్తేర్ రాణి, ఖలీల్ పాల్గొన్నారు.

వైసీపీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎస్వీ మోహన్‌రెడ్డిని అధిష్ఠానం నియమించడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్ సమావేశం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని వర్గాలను కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయానికి పోరాడుతామన్నారు. ఈసమావేశంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు అక్కిమి హనుమంతరెడ్డి, పటేల్ హనుమంతరెడ్డి, కిషన్, రాఘవేంద్రనాయుడు, లాజర్, గోల్డ్ శ్రీను, బుల్లెట్ అంజి, సలీంభాయ్, ఫిరోజ్ పాల్గొన్నారు.

మానవ హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

సి.బెళగల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. శనివారం మండలం లోని ముడుమాల గ్రామంలోని సచివాలయంలో సింగిల్ విండో డైరెక్టర్ రేపల్లె పౌలు అధ్యక్షతన మానవ హక్కులపై సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి భాస్కర్, టీడీపీ నాయకుడు జగదీశ్వర రెడ్డి, సర్పంచ్ బతుకమ్మ పాల్గొన్నారు.

బీజేపీ అభివృద్ధికి కృషి చేస్తా

గూడూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పార్టీ నాయకుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో గజేంద్ర గోపాల్ నాయుడు బీజేపీలో చేరారు. గజేంద్ర గోపాల్ నాయుడు మాట్లాడుతూ టీడీపీలో తగిన ప్రాధాన్యం ఇవ్వనందునే బీజేపీలో చేరామన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

కర్నూలు అర్బన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ మార్చ్ ఫర్ సైన్స్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి మొహమ్మద్‌వైజ్, కె. విశ్వనాథ్, అధ్యాపకులు ఎం.షానవాజ్, నాగరాజు, ఫామీదా, నాగ్ అరుణ్, విదార్థులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌ను ఆధునికీకరించాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సి.క్యాంపులో జర్నలిస్టుల కోసం కేటాయించిన ప్రెస్‌క్లబ్‌ను ఆధునికీకరించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన ప్రెస్‌క్లబ్‌ను సందర్శించారు. హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్‌ను కేటాయించినందుకు కలెక్టర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణగుప్త, ఫొటోగ్రాఫర్ కరణ్, రాము, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని శనివారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక వ్యక్తి చనిపోయిన సమయం నుంచి 6 గంటలలోపు నేత్రదానం చేయడానికి సంసిద్ధతను ఫోన్ ద్వారా తెలియజేసినట్లయితే దగ్గరగా ఉన్న కంటి సేకరణ కేంద్రం వారు వచ్చి వారి నేత్రాలను సేకరించి అంధత్వం గల వారికి ఉచితంగా అమర్చుతారన్నారు. ఆప్తమాలజిస్టు టెక్నీషియన్స్ పరమేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 350 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ తన నేత్రాలు దానం చేయడానికి అంగీకార పత్రాన్ని డాక్టర్ సంధ్యారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయశేఖర్, సోమేష్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఉస్మానియా విద్యార్థి ప్రతిభ

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బెంచ్ ప్రెస్ విభాగంలో 95 కేజీల విభాగంల బ్రాంజ్‌మెడల్ సాధించారు. శనివారం కాలేజీలో జరిగిన అభినందన సభలో విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అజ్రాజావీద్, ప్రిన్సిపాల్ డా.సయ్యద్ సమీవుద్దీన్, అధ్యాపకులు సలీం బాషా, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

కూలీ ఇంట విద్యాకుసుమాలు

● ఐదుగురు కూతుళ్లకు చదువు ● డాక్టర్ కానున్న ఆదర్శ



ఆదర్శ

కోడుమూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు ఐదుగురు కూతుళ్లు. సెంటు పొలం లేదు. కూలీ వెళితేనే జీవనం. ఈ పరిస్థితుల్లో ఆ దంపతులు కూతుళ్ల విద్యపై శ్రద్ధ కనబరుస్తున్నారు. మండలంలోని వర్కూరు న్యూఎస్సీ కాలనీకి చెందిన పెమరం రాజశేఖర్, నాగేంద్రమ్మ దంపతులు కూలీ పనులు చేస్తూ పిల్లలకు మంచి విద్య అందిస్తున్నారు. పెద్దకుమార్తె లలిత కుమారిని డిగ్రీ, టీటీసీ చదివించారు. ఆమెకు వివాహం జరిపించారు. రెండో కూతురు లావణ్య ఇంటర్ వరకు చదువుకున్నారు. తర్వాతి సంతానం స్నేహ, కీర్తి ఇద్దరూ ప్రస్తుతం బీఈడీ చదువుతున్నారు. ఐదో సంతానమైన ఆదర్శ ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ ఏడాది నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయి 160233 ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 6395 ర్యాంకు సాధించింది. దీంతో కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీలో ఉచిత సీటు సాధించారు. ఇటీవలే సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రూ. లక్ష చెక్, మెమెంటో అందుకున్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించడం గర్వకారణం



విద్యార్థినులను సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుర్ని కులానికి చెందిన ఎం వెంకటేష్ కుమార్తె శ్రీధన్య, ఎం.తిమప్ప కుతురు ఊర్మిల నీట్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు సాధించడం గర్వకారణమని కుర్ని సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు జి నాగభూషణం అన్నారు. శనివారం గూడూరులో కుర్ని సంఘం ఆధ్వర్యంలో శ్రీధన్య, ఊర్మిలను సంఘం పెద్దలు సన్మానించారు. వారు మాట్లాడుతూ శ్రీధన్య 592 మార్కులు సాధించి మంగళగిరిలోని ఎయిమ్స్ మెడికల్ కళాశాలలో, ఊర్మిల 488 మార్కులు సాధించి అనంతపురం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సురేంద్రనాథ్, శ్రీను, వెంకటేష్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

బురద



మండలంలోని దొడగొండ - తొగలగల్ 8 కి.మీ. రహదారి బురదమయంగా ఉండటంతో వాహనదారులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ దారిలో నిత్యం ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడంతో మట్టి రోడ్డు ధ్వంసమై వర్షపు నీరు నిలిచి బురదతో నిండింది. నిత్యం తాము ఈ దారిలోనే వెళ్లాల్సి వస్తోందని తొగలగల్, దొడగొండ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాత్కాలికంగా గ్రావెల్ వేయాలని, అనంతరం సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

- ఆస్పరి

మురుగు



మండలంలోని తెర్నేకల్ మాలగేరి వీధుల్లో వర్షపు నీరు, మురుగు నిలిచింది. తమ కాలనీల్లో సీసీ రోడ్లు ఉన్నా డ్రైనేజీ లేక నిత్యం మురుగులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

- దేవనకొండ

పౌష్టికాహారాన్ని అందించాలి

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రావణి సూచించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార సదస్సు నిర్వహించారు. కిశోర బాల బాలికలకు సైతం పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు పాలు, గుడ్లు, బాలామృతం, బాల సంజీవని సక్రమంగా ఇవ్వాలని, మహిళలు రక్తహీనతకు గురి కాకుండా ఈ పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు.

రూ.89.40 లక్షలకు మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆస్పరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బిల్లేకల్ మార్కెట్ దినసరి టమాటా కూరగాయల మార్కెట్ వేలం రూ.89.40 లక్షలు పలికింది. శనివారం ఐదుగురు కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనగా బాట తిక్కయ్యకు రూ.89.40 లక్షలలకు దక్కించుకున్నారు. గతేడాది కంటే రూ.26.72 లక్షలు అధికంగా ఆదాయం వచ్చినట్లు ఎంపీడీవో గీతావాణి తెలిపారు. ఆదాయంలో 25 శాతాన్ని గ్రామాభివృద్ధికి వెచ్చిస్తామని కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో సీఐ గంగాధర్, మాజీ ఎంపీపీలు కృష్ణయాదవ్, వెంకటేష్, మహేష్, వీరేష్, పెద్దయ్య, కార్యదర్శులు విజయరాజ్, సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగికి సన్మానం

తుగ్గలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన జయ ప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర సన్మానించారు. శనివారం తుగ్గలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగిని అభినందించారు. ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్, హెచ్ఎం అగస్టీన్, పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్ ఉన్నారు.



ఉద్యోగిని సన్మానిస్తున్న తుగ్గలి నాగేంద్ర

కూలీ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు

తుగ్గలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కెళ్ల గ్రామంలో కూలీగా పనిచేస్తున్న బండ్లపల్లి వెంకటేశ్, మునేశ్వరమ్మ దంపతుల కుమారుడు వంశీకి ఎంబీబీఎస్ సీటు లభించింది. నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కళాశాలలో సీటు రావడంతో మాజీ సర్పంచ్, చంద్రన్న, లక్ష్మీదేవి శనివారం సన్మానించారు. వంశీ మాట్లాడుతూ తాను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు అందిస్తానన్నారు.



వంశీని సన్మానిస్తున్న గ్రామపెద్దలు

సీజనల్ వ్యాధుల నుంచి కాపాడండి

పత్తికొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ నాయకులు కారుమంచి, రామాంజనేయులు కోరారు. శనివారం పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్యకు వినతి పత్రం అందించారు. వర్షాల ప్రభావంతో కాలనీల్లో మురుగు, వర్షపునీరు చేరి దోమలువ్యాప్తి చెందాయన్నారు. దోమకాటుతో ప్రజలు, చిన్నారులు డెంగీ, మలేరియా బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు చిన్నారులు డెంగీ, విష జ్వరాలతో ఆసుపత్రిలో చేరి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కారన్న, వీరన్న, సుల్తాన్, ఖాన్, అల్తాఫ్, ఇమ్రాన్, మాదప్ప పాల్గొన్నారు.



సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య కోరారు. శనివారం ఎమ్మెల్సీలు బీటీ నాయుడు డాక్టర్, మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. నిజాయితీపరుడిగా, ఆదర్శ నాయకుడిగా ప్రజల మన్ననను పొందిన మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరును జిల్లాకు పెట్టి ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరారు. సభ్యులు దామోదరం రాధాకృష్ణమూర్తి, నాగభూషణం, రంగస్వామి, దేవిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కార్మికుల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న ఎం.డి.అంజిబాబు

ఆలూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.డి.అంజిబాబు పిలుపు నిచ్చారు. శనివారం సీఐటీయూ భవనంలో మండల మహాసభను వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించించి, మోదీ పాలనలో పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని విమర్శించారు. అనంతరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నారాయణస్వామి, కో కన్వీనర్‌గా వీరేష్, అనితతో పాటు 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. హనుమంతు షాకీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

● సమస్యలు పరిష్కారం కావడం లేదని సభ్యుల ఆవేదన ● నిధుల వివరాలు చెప్పాలని డిమాండ్



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ సందీప్ రెడ్డి



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

ఆదోని టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై చర్చించాల్సిన పురపాలక సమావేశం రసాభాసగా సాగింది. శనివారం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు, సమస్యలను పట్టించుకోనేవారు లేరని పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. కౌన్సిలర్ వైజీ బాలాజీ మాట్లాడుతూ డిసెంబర్‌లో ఎల్ఎల్‌సీ కాలువకు నీటి విడుదల నిలిచిపోతుందని, బసాపురం చెరువ మరమ్మత్తుల కారణంగా నిరుపయోగంగా ఉందన్నారు. ఇక మిగిలిన రాంజల చెరువులో నీరు ఉన్నా, చెరువు లీకేజీలను పట్టించుకొనే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ఎన్నిసార్లు సూచనలు ఇచ్చినా పట్టించుకొనే వారు లేరని ఆరోపించారు. అనంతరం కౌన్సిలర్లు హసీనా, పార్వతి మాట్లాడుతూ తమ వార్డుల్లో మంజూరైన అభివృద్ధి పనులు నెలలు గడుస్తున్నా ఎందుకు చేయడం లేదని అధికారులను నిలదీశారు. కమిషనర్ కృష్ణ సమాధానం ఇస్తూ గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొత్త పనులను చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. కౌన్సిలర్లు బిందు, సందీప్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.7కోట్ల నిధులను తాను తీసుకొస్తే, వైసీపీ కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించడం సరికాదన్నారు. పురపాలక సంఘానికి వచ్చిన నిధుల వివరాలను తమకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఉన్నత విద్యావంతులు కావడం అదృష్టంగా భావిస్తున్నామని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కౌన్సిలర్లు రఘు, సందీప్ కోరారు. మొదటి కౌన్సిల్ సమావేశానికి ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా హాజరైన ఎమ్మెల్సీ బీటీ నాయుడును చైర్‌పర్సన్, కమిషనర్ సన్మానించి పూల మొక్కను బహూకరించారు.

సీఎం దృష్టికి సమస్యలు: ఎమ్మెల్సీ బీటీ నాయుడు

పట్టణ ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బసాపురం చెరువుకు శాశ్వత మరమ్మతులకు రూ.70కోట్లు అవసమని అధికారులు ప్రతిపాదనలు ఇచ్చారన్నారు. అలాగే టిడ్కో గృహాల పనులు, నూతన వంతెన నిర్మాణానికి సంబంధిత మంత్రులతో చర్చించి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే నెల శాసన మండలి సమావేశాలలో సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు

● ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ హేమలత



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎస్పీ హుసేన్ పీరా

ఆదోని, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం గణేష్ నిమజ్జనానికి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ హేమలత తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఊరేగింపులో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు అయిదుగురు డీఎస్పీలు, 33 మంది సీఐలు, 47 మంది ఎస్ఐలు, 818 మంది పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. మఫ్టీలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఆర్ట్స్ కళాశాల నుంచి వచ్చే విగ్రహాలు, తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, చందాసాబ్ దర్గా మీదుగా నిర్మల్ థియేటర్, శ్రీనివాసభవన్, మేదరగేరి మీదుగా ఫ్లై ఓవర్‌బ్రిడ్జి పై నుంచి చిన్నహరివాణం గ్రామ సమీపాన ఉన్న ఎల్ఎల్‌సీ కెనాల్‌కు తీసుకెళ్తారన్నారు. భక్తులు, నిర్వాహకులు పోలీసుల సూచనలను పాటిస్తూ నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. బాణసంచాలు కాలుస్తూ ఇబ్బందులకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమజ్జనంలో వైద్య శిబిరాలు

ఆదోని టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం వినాయక నిమజ్జనం సందర్భంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.సందీప్ కుమార్ శనివారం తెలిపారు. శ్రీనివాస భవన్, సిరుగుప్ప చెక్‌పోస్ట్, బసాపురం వినాయక ఘాట్ ప్రాంతాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

మిత్రుడి కుటుంబానికి సాయం

ఆలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1, 2 2000-2001 బ్యాచ్ విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. తమ బ్యాచ్‌కు చెందిన తంగరడోణ రంగనాథ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు శనివారం గ్రామానికి చేరుకుని రూ.33,500లు అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ అన్నారు. శనివారం గ్రామంలో జల్‌జీవన్ పనులను పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకు పనులు పూర్తి చేసి నీరందిస్తామని తెలిపారు. వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్ రెడ్డి ఉన్నారు.

అందరికీ పింఛన్లు అందుతాయి

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులందరకీ పింఛన్లు అందుతాయని అధైర్యపడొద్దని ఎంపీడీవో స్వర్ణలత కోరారు. శనివారం మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 71 మందితో జాబితాను పంపామన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్నారన్నారు.

రైతుల భూములను లాక్కుంటే

అడ్డుకుంటాం

● వారికి మద్దతుగా నేడు నిరసన : ఎమ్మెల్యే విరుపాక్షి



ఆలూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పవర్‌గ్రిడ్ ప్రాజెక్టు పేరుతో రైతుల భూములను లాక్కుంటే అడ్డుకుంటా మని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం మాట్లాడుతూ మండలంలోని మణేకుర్తి, కమ్మరచేడు, ఎ.గొనేహాల్ గ్రామాల్లో రైతుల భూముల్లో అదానీ కంపెనీ పవర్‌గ్రిడ్ ఏర్పాటుతో సారవంతమైన సాగు భూములను రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం మరోసారి సర్వే చేయించి, మరోచోట నిరుపయోగంగా ఉన్న భూముల్లో పవర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు మద్దతుగా ఆదివారం గ్రామాల్లో పవర్‌గ్రిడ్ రద్దు చేయాలని నిరసన చేయనున్నట్లు తెలిపారు.

హంద్రీనీవా కాలువలో మృతదేహం

ఉరవకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్ హౌస్ వద్ద కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన బసవన్నగౌడ్(53) మృతదేహం లభ్యమైంది. ఆయన ఈ నెల 27వ తేదీన గుంతకల్లు మండలం కసాపురం ప్రాంతానికి వెళ్లారు. హంద్రీనీవా కాలువలో స్నానం చేసేందుకు దిగి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కాలువ వద్ద దుస్తులు, చెప్పులు, ఆధార్ కార్డును ఈ నెల 28న సమీప రైతులు గుర్తించారు. ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కాలువ పొడవునా గాలించినా ఫలితం లేకపోయింది. చివరకు రాగులపాడు పంప్ హౌస్ వద్ద శనివారం మృతదేహం తేలియాడింది. పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

తుగ్గలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి ఎంఈవో రమావెంకటేష్ గౌడ్ సూచించారు. శనివారం తుగ్గలి, జొన్నగిరి పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సమాజంలో చోటుచేసుకునే సంఘటలను తెలియజేయాలన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ విరాళం



కంప్యూటర్ అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఆదోని టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడితోట గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు వారు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. శనివారం పాఠశాలలో బ్యాంక్ బీవోఎం రాయచోటి సుబ్బయ్య, వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు సురేష్ గుప్తా, విరుపాక్షి రెడ్డి హెచ్ఎం చంద్రశేఖర్‌కు అందజేశారు. చిన్న మస్తాన్, మల్లయ్య పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ సక్రమంగా చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం లక్ష్మమ్మ

దేవనకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు బ్యాంకు లింకేజీ సక్రమంగా చేయాలని వెలుగు ఏపీఎంగా మాదాల లక్ష్మమ్మ సూచించారు. శనివారం స్త్రీశక్తి భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏపీఎం వెంకట్రామిరెడ్డి ఆనారోగ్య కారణాలతో గతంలో పనిచేసన ఓర్వకల్లుకు తిరిగి వెళ్లారు. దీంతో తాను కల్లూరు నుంచి డిప్యూటేషన్‌పై దేవనకొండకు వచ్చినట్లు మాదాల లక్ష్మమ్మ తెలిపారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ మైదానిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెద్దతుంబళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు హెచ్ఎం మారుతిప్రియ తెలిపారు. శనివారం పాఠశాలలో క్రీడాకారులను పాఠశాల అభినందించారు. బాలికలు కోకోలో రజత పథకాన్ని, కబడ్డీ బాలికల విభాగంలో కాంస్య పథకాన్ని గెలుపొందారన్నారు. అథ్లెటిక్, జావలిన్ త్రోలో బంగారు పథకాన్ని సాధించడం అభినందనీయమని తెలిపారు. పీఈటీ నరసింహరాజు, రమేష్, ఉపాధ్యాయులు సూర్య నారాయణ పాల్గొన్నారు.



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్రామాల్లో బెస్త కులస్థుల పూజలు

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయకుని నిమజ్జనం ముగిసిన తర్వాతి రోజు గ్రామాల్లో బెస్త కులస్థులు జోకుమారుడి పేరుతో ప్రత్యేక పూజలు నిర్వహించడం పత్తికొండ ప్రాంతంలో అనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం మేరకు శనివారం మద్దికెరలో జోకుమారుడు ప్రతిమను గంపలో పెట్టుకుని పూర్వికుల సంప్రదాయాలను గ్రామంలో బెస్త కులస్థులకు చెందిన మహిళలు ఇంటింటికి తిరిగి పాటలు పాడుకుంటూ ధాన్యం సేకరించారు. ఇలా చేస్తే సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి పల్లెలు సుభిక్షంగా ఉంటాయని నమ్మకం.



జోకుమారుడి పూజలు చేస్తున్న మహిళలు

కందిపోయింది

● అధిక వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న కంది పంట

● తీవ్రంగా నష్టపోయిన రైతులు, ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



మద్దికెరలో దెబ్బతిన్న కంది పంట

మద్దికెర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల ప్రభావంతో కంది పంట పూర్తిగా దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటు న్నారు. మండలంలోని 11 గ్రామాల్లో 12 వేల ఎకరాల్లో ఈ ఖరీఫ్‌లో కంది పంటను సాగు చేశారు.

ముంచిన వర్షం..

మొదట్లో పంట ఆశాజనకంగా ఉండటం, మొక్కలు ఏపుగా పెరగడంతో రైతులు సంతోషించారు. అయితే పది రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నాయి.

మందులు వాడినా ఫలితం లేదు..

కంది పంటను కాపాడుకోవడానికి క్రిమి సంహారక మందులు, ఎరువులు వాడామని అయినా కోలుకోలేదని రైతులు వాపోతున్నారు. నల్లరేగడి పొలాలు కావడతో తేమ ప్రభావంతో పంట ఎండిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎకరాకు రూ.25వేల పెట్టుబడి..

కంది సాగుకు ఇప్పటికే ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు రెతులు అంటున్నారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడంతో ఎంతో ఆశతో పంటలు సాగు చేశామని, దురదృష్టవశాత్తు పంట చేతికొస్తున్న సమయంలో పూర్తిగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.లక్ష పెట్టుబడి పెట్టా

నాలుగెకరాల్లో కంది సాగుచేశా. ఎకరాకు రూ.25వేల చొప్పున రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. వర్షం దెబ్బకు పంట దెబ్బ తింది, ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి. **- యుగంధర్, అగ్రహారం**



ఎరువులు పిచికారీ చేయాలి



కంది మొక్కలు దెబ్బతిని ఉంటే 13045 రకం ఎరువును ఎకరాకు కిలో చొప్పున పిచికారీ చేయాలి. పంట దెబ్బతిన్న రైతులు సంప్రదిస్తే పంటను కాపాడుకునేందుకు సూచనలు, సలహాలు ఇస్తాం. **- ఏవో, రవి**

వినూత్న నిరసన



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

నందవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో ప్రభుత్వ ఆసుపత్రి ముందు వర్షపు నీరుతో ప్రజలు ఆసుపత్రిలోకి వెళ్లడానికి వీలులేకుండా గుంతలమయంగా తయారయ్యిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప అన్నారు. శనివారం మండల కేంద్రమైన నందవరం పీహెచ్‌సీ ముందు నిల్వ ఉన్న నీటి గుంతలలో మొక్కలు నాటి నిరసన కార్యక్ర మం చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు వారాలుగా కురుస్తున్న వర్షపు నీరు ఆసుపత్రి ముందుకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఆసుపత్రిలోకి రావాలంటే వెనుకంజు వేస్తున్నారన్నారు. తాత్కలిక మరమ్మతులైన చేపట్టి ప్రజలను ఆదుకోవాలన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడు మృతి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్లు గ్రామానికి చెందిన మడ్రి పురుషోత్తం(50) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేయాలని మండల నాయకులను ఆదేశించారు. దీంతో మార్కెట్ యార్డు డైరెక్టర్ దావీదు, దేవదాసు, మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు మడ్రి పురుషోత్తం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్ధిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేష్, రంగన్న, అయ్యన్న, దస్తగిరి, కొండయ్య పాల్గొన్నారు.

భూవివాదంలో కేసు నమోదు

పెద్దకడబూరు , ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సర్వే నెంబర్ 174/1 భూ వివాదంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ భూమిని ఎవరూ.. సాగు చేసుకోకుండా తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ఆదేశాలు జారీ చేశారన్నారు. అలాగే 145సీఆర్‌పీసీ ప్రొసిడింగ్స్ ఉన్నాయన్నారు. అయితే అధికారుల ఆదేశాలను బేఖాతార్ చేస్తూ భూమిని సాగుచేసేందుకు ప్రయత్నించడంతో తహసీల్దార్ గీతా ప్రియదర్శిని ఫిర్యాదుతో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దళిత మహిళలపై దాడులు సహించం



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

మంత్రాలయం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలపై సహించేది లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు అన్నారు. శనివారం మంత్రాలయంలో ప్రైవేటు అతిథి గృహంలో కేవీపీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా సెప్టెంబరు 6వ తేదీన మంత్రాలయంలో జరిగే దళిత మహిళా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆధిపత్య వర్గాలు భూమిని దళితులు కొన్నారనే అక్కసుతో ఆదోని మండలం నాగనహతి గ్రామంలో దళిత మహిళను పట్టపగలే ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారనీ కల్లుకుంట గ్రామంలో కులాంతర వివాహం చేసుకున్నాడన్న సమాచారంతో ఊరి నుంచి వెలివేశారన్నారు. ఇలాంటి దాడులు ఎక్కువయ్యాయనీ, వీటికి వ్యతిరేకంగా కేవీపీఎస్ ఉధృత పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి విజయమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, అంజి, అనిల్, దేవపుత్ర వీరేష్ సలోమి, ఎలిజబెత్, దేవ, మారెప్ప, పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 57 మందికి జరిమానా

ఎమ్మిగనూరు, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం, రూరల్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఎమ్మిగనూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి జ్యోత్స్న 57మందికి జరిమానా విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న, కోర్టు కానిస్టేబుల్ తెలిపిన సమాచారం మేరకు... ఎమ్మిగనూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేసిన సమయంలో 35మంది మద్యం తాగి వాహనాలు నడపటంతో వారిపై కేసునమోదు చేశారు. అలాగే పట్టణ పోలీసు స్టేషన్ పరిదిలో 14మంది, రూరల్ పోలీసు స్టేషన్ పరిదిలో 8మంది మద్యం తాగి వాహనాలు నడపటంతో డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిని శనివారం ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా మద్యం తాగి వాహనాలు నడిపినందుకు రూ. 10వేల చొప్పున 57 మందికి రూ. 5.70లక్షల జరిమానా విధించారు.

లోక కల్యాణార్థం గీతాజ్ఞాన యజ్ఞం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్థానిక గీతా నగర్‌లో వెలసిన గీతామందిర్‌లో లోక కళ్యాణార్థం చేసిన గీతా జ్ఞాన యజ్ఞాలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం నాగరాజు, ఉరుకుందప్ప మాట్లాడుతూ ఆగస్టు 13వ తేదిన ప్రారంభించిన గీతా జ్ఞాన యజ్ఞం విశేషంగా పాల్గొన్న దంపతులు, అశేషంగా పాల్గొన్న భక్తుల మధ్య గీతా యజ్ఞ హోమాలు 18 రోజులు నిర్విఘ్నంగా జరిగాయని అన్నారు. భగవద్గీత ఉపన్యాసాలు శనివారంతో ముగిశాయని, ఇందుకు సహకరించిన భక్త జనులకు ధన్యావాదాలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు విరివిగా పాలొన్నారు. ఈ కార్యక్రమంలో శివన్న, నాగరాజు, చెన్నారెడ్డి, నాగశేషప్ప తదితరుల పాల్గొన్నారు.

రోడ్లన్నీ బురదమయం



సర్పంచ్ ఇంటి వద్ద బురదగా మారిన రస్తా



ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగు

మంత్రాలయం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వర్షం పడితే రోడ్లు బురదమయంగా దర్శని మిస్తున్నాయి. జడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ మేకల సుజాత, ఎంపీటీసీ లు మజ్జిగ నరసమ్మ, కోసిగి విజయలక్ష్మి ప్రజాప్రతినిధులుగా కొనసా గుతున్నారు. పేరుకే ప్రజాపతినిధులు కానీ సమస్యలు గాలికొది లేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చినుకు పడితే చాలు.. చిత్తడి చిత్తడే... గ్రామానికి ఇలవేల్పు అయిన బంగారమ్మ దేవాలయానికి వెళ్లే దారిలో రోడ్లన్నీ బురదమయం. ప్రధాన రహదారిలో తాగునీటి గుమ్మీల వద్ద చెత్తాచెదారంతో నిండి పందులకు, కుక్కలకు, దోమలకు నిలయంగా మారింది. ఎస్సీ కాలనీలో ఏ రోడ్డు చూసినా బురద, మురుగు కాలువల్లేని రోడ్లే దర్శనమిస్తాయి. సర్పంచ్ ఇంటి పక్కనే ఉన్న రోడ్డులో రచ్చరచ్చగా మారి రాకపోకలు సాగించలేకపోతున్నారు. మహిళా ప్రజాప్రతినిధులు గ్రామానికి ఎన్నికైన ఏఒక్క పైసా కూడా నిధులు కేటాయించక పోవడంతో గ్రామంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీంతో గ్రామంలో మురుగు కాలువల్లోని చెత్తాచెదారం నిండి ఉండటమే కాకుండా దుర్వాసన వెదజల్లుతూ గ్రామ ప్రజలు అంటురోగాల బారిన పడుతున్నారు. జడ్పీటీసీ సొంత గ్రామానికే దిక్కులేకపోతే మిగతా గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ జీవనం గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

నడవలేకపోతున్నాం



మా ఇంటి ముందే నీరు నిలిచిఉండటం వల్ల రాకపోకలు సాగించలేకపోతున్నాం. దాదాపు పది రోజుల నుంచి వర్షాలు పడుతున్నా నీటి మడుగులా ఆగి ఉన్నా సర్పంచ్ పట్టించుకోవడం లేదు. దళిత సర్పంచే అయిుండి దళిత కాలనీలనే విస్మరించారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● యోహాన్, గ్రామస్థుడు, రచ్చుమర్రి

సర్పంచ్ ఉన్నారా.. లేరా..?



రోడ్ల మీద మురుగునీరు ప్రవహిస్తూ దుర్వాసనతో ఇంటి వద్ద ఉండలేకపోతున్నాం. గ్రామానికి సర్పంచ్ ఉన్నారా లేదా..? అని ప్రశ్నించింది. పేరుకు మాత్రం పెద్ద గ్రామం. సౌకర్యాలు మాత్రం అతీగతీ లేదు. అధికారులు పట్టించుకుని సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించండి.

● హుసేనమ్మ, రచ్చమర్రి

నిధులు లేక సమస్య



గ్రామంలో రోడ్లపై బురద, మురుగు కాలువలను నిధులు లేకపోవడంతో శుభ్రం చేయకపోతున్నాము. వర్షాకాలం కావడంతో బురద రోడ్లపై నీరు నిలిచి అపరిశుభ్రంగా మారాయి. అధికారులతో మాట్లాడి శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటా.

● మేకల సుజాత, సర్పంచ్, రచ్చమర్రి

కోసిగయ్యలో గణనాథునికి ప్రత్యేక పూజలు



కోసిగయ్య గుడిలో పూజలందుకుంటున్న గణనాథుడు

కోసిగి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని కోసిగయ్య గుడి, శ్రీ మారెమ్మ దేవాలయం, కాళికాదేవి, గీతా మందిరం, ఊరువాకిలి, ఈశ్వరస్వామి దేవాలయం ఎన్టీఆర్ నగర్ లలో కొలువైన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోసిగయ్య గుడిలోని ఆంజనేయస్వామితో కలిసి ఉన్న గణనాథునికి శనివారం పెద్ద ఎత్తున విష్ణు, ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే 9వ వార్డు శ్రీరామ్‌నగర్ వినాయక మిత్ర మండలి సభ్యులు సుమారు 2వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

స్వచ్ఛంద పదవీ విరమణ అభినందనీయం



నూర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ నూర్ అహ్మద్ ఇంకా రెండేళ్లు ఉండగానే స్వచ్ఛంద పదవి విరమణ చేయడం హర్షించదగ్గ విషయమని తహసీల్దార్లు రమాదేవి, శ్రీమఠం ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు, రిటైర్డు తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీలు గురురాజరావు, సరస్వతి, సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి, మండల సర్వేయర్ అశోక్ ఆధ్వర్యంలో శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. మంత్రాలయంలో 20 ఏళ్ల జూనియర్ అసిస్టెంట్‌గా భాధ్యతలు నిర్వహించి అందరి మన్ననలు పొందారని అలాంటి వారి సేవలు మరువలేనివన్నారు. అదే విదంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న హంపయ్య పదవి విరమణ చేశారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ సీవీ విశ్వనాథ్ రెడ్డి, అటోడే హోటల్ మేనేజర్ రజనీ కాంత్, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, డీటీ రాగవేంద్ర, ఆర్ఐ జనార్ధన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం



మూలరాములకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. శనివారం బాద్రపద సప్తమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో విశాల వెండి మంటపంలో మూలరాములు, జయరాములు, దిగ్విజరాములకు బంగారు నాణేలతో అబిషేకం చేసి హారతులు ఇచ్చారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. శని,ఆదివారం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శ్రీమఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, అన్నపూర్ణ భోజనశాల భక్తులతో కిక్కిర్సింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులకు శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

క్రీడల్లో కూడా ప్రతిభ చాటాలి

కోసిగి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోకూడా ప్రతిభ చాటాలని కోసిగి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిమళదేవి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు అంజలి, అంకితలు క్రీడాప్రతిభను కనబరిచి ఆదోని జోనల్ లెవెల్‌లో ఖో-ఖో పోటీలో మూడో స్థానం సాధించడంతో విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రమణ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

'చివరి శ్వాస వరకు టీడీపీలోనే'



రామిరెడ్డిని సన్మానిస్తున్న మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి

కోసిగి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలో కొన సాగుతానని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. తాను టీడీపీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆశీస్సులతో కోసిగి మండల టీడీపీ కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామనీ అన్నారు. టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, నాడిగేని అయ్యన్న, తోవి రామకృష్ణ, తాయన్న, వక్రాణి వెంకటేశ్, చింతలగేని నర్సారెడ్డి, కోసిగయ్య, గాలెం వీరేష్ పాల్గొన్నారు.

గుడికల్ కొండల్లో అక్రమ తవ్వకాలు



తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామ సమీపంలో ఉన్న ఎల్లెల్సీ కాలువను ఆనుకొని ఉన్న కొండల్లో(కోతిగుట్ట) కొంతమంది అక్రమంగా ఎర్రగరుసు త్వకాలు చేసి తరలిస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ఎర్రగరుసు తవ్వకాలు చేయటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందటంతో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడింది. తాజాగా శనివారం కొండదగ్గరకు (కోతిగుట్ట) ఏకంగా జెసీబీని తరలించి దాని ద్వారా కొండకున్న ఎర్రగరుసును తవ్వి రెండు ట్రాక్టర్లద్వారా తరలించారు. పట్టణానికి అతి సమీపంలో ఉన్న కొండల్లో ఎదేచ్ఛగా ఎర్రగరుసు తవ్వి తరలిస్తున్నాసంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టు వ్యహరిసుండటం విమర్శలకు తావిస్తోంది. మండలంలోని ఓగ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడి కను సన్నుల్లో ఎర్రగరుసు తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా బనవాసి ఫారంలో ఇదేతరహాలో రాత్రికి రాత్రి జేసీబీ పెట్టి తవ్వి ట్రాక్టర్లద్వార ఎమ్మిగనూరు పట్టణానికి తరలించి సోమ్ము చేసుకున్నారు. ఇదే తరహాలో కొతిగుట్ట కొండల్లో ఎర్రగరుసు తవ్వి తరలించటం విమర్శిలకు తావిస్తోంది.గరుసు తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవటంతో గరుసు అక్రమ తవ్వకం దారులు చెలరేగిపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి అక్రమ గరుసు తవ్వకాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

వరద నీటితో జీడీపీ కళకళ

గోనెగండ్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు వదర నీటితో కళకళలాడుతోంది.శనివారం సాయంత్రానికి జీడీపీలో 2.5 టీఎంసీ(లైవ్) నీరు ఉన్నట్లు జీడీపీ ఇరిగేషన్ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. జీడీపీ ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు. హంద్రీనీవా నుంచి రోజుకు 200 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అలాగే తుంగభద్ర దిగువ కాలువ నుంచి రోజుకు 72 క్యూసెక్కు నీరు చేరుతోంది. గత మూడేళ్లుగా వరద నీరు వచ్చి చేరలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, రాతన, తదితర ప్రాంతాలలో వర్షం కురియడం కారణంగా వరద నీరు వచ్చి చేరుతోంది.

ఎమ్మెల్యేకు దశమి మహోత్సవ ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న టీడీపీ నాయకులు, గ్రామ సర్పంచ్

గోనెగండ్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో సెప్టెంబరు నెలలో 12వ తేదీ నుంచి 16 తేదీ వరకు జరుగుతున్న చింతలాముని, నల్లారెడ్డి, స్వామివారి దశమి మహోత్సవంకు రావాలంటూ సర్పంచ్ దంపతులు, హైమావతి, చంద్రశేఖర్, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహేల్ రహంతుల్లా, మాజీ సర్పంచ్ రంగముని మొదటి ఆహ్వాన పత్రికను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, వ్యాపారవేత్త భాస్కర్ల చంద్రశేఖర్‌కు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ ప్రజల తరుపున గ్రామ సర్పంచ్ హైమావతి, టీడీపీ తరుపున నాయకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వెంకటేశ్వర్లు, డ్రామ కౌలుట్లయ్యనాయుడు, గౌండరహంతుల్లా, ఎస్వీబాబునాయుడు, మేకల మునెప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ



ప్రహల్లాదరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

నందవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని గంగవరంకు చెందిన వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డిని మాజీ ఎంపీ, వైసీపీ నియోజకవర్గ ఇన్ చార్జి బుట్టారేణుకా శనివారం పరామర్శించారు. బుట్టా ప్రతుల్, మండల పార్టీ కన్వీనర్ శివారెడ్డి గౌడు, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడి ఆధ్వర్యంలో గంగవరం గ్రామానికి వెళ్లారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న ఆయన పరిస్థితి గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమం కేఆర్ రామకోటిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సోమలగూడురు వెంకటేశ్వరరెడ్డి, షరీఫ్, రాజ్‌కుమార్, సంజీవరెడ్డి, కృష్ణమూర్తి, రాజారెడ్డి, పల్లే రాఘవరెడ్డి, చాంద్, ముగతి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

గంగ ఒడి నుంచి ఒడ్డుకు..



ఒడ్డుకు కొట్టుకొస్తున్న గణనాథులు

గోనెగండ్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టులో శుక్రవారం నిమజ్జనం చేసిన గణనాథుల విగ్రహాలు నీటిలో తేలుతూ ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. నిమజ్జనం చేసే భక్తులు విగ్రహాలను ప్రాజెక్టు లోపల నీటిలో వేయకుండా గట్టున ఉన్న మునిగి మునగని నీటిలో వేయడంతో విగ్రహాలు తేలుతూ ఒడ్డుకు వస్తున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 250 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనను చూసిన వినాయక భక్తులు, ప్రజలు, 'మమ్ములను క్షమించు గణపయ్యా' అంటు మొక్కుతున్నారు. ఈ సంఘటనను చూసిన గణేశ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులు భక్తి శ్రద్ధలతో పూజించి ఈలా నీటి గట్టు పై విగ్రహాలను వేయడం దారుణం అంటున్నారు. అలాగే పర్యటక ప్రేమికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టర్ పారీస్ తో చేసిన విగ్రహాలను జీడీపీ లో వేయడంతో నీరు కాలుష్యం అవ్వడమే గాక అందులో ఉన్న చేపలు ఇతర జలచరాలు మృతి చెందే అవకాశం ఉందన్నారు. అలాగే తాగునీటి పథకాలకు కూడా ఇదే నీరు పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన వచ్చే ఏడాది మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని పర్యటక ప్రేమికులు కోరుతున్నారు.

ఎమ్మిగనూరు: పట్టణం సమీపంలో ఉన్న ఎల్లెల్సీ కాలువలో శుక్రవారం పట్టణతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో ప్రజలు ఏర్పాటు చేసిన వందలాది వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. దీంతో కాలువలో వినాయక విగ్రహాలు పర్లాంగు మేర ఉండిపోయాయి. కాలువలో వేసిన వినాయక విగ్రహాలను వెంటనే తొలగించాల్సిన సంబందిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటంతో విగ్రహాలు అలాగే తేలియాడుతూ కనిపిస్తున్నాయి. వందల సంఖ్యలో విగ్రహాలు ఉండటంతో వాటి రంగులు, ఇతర పరికరాల వల్ల నీరు కలుషితం అయ్యో అవకాశం ఉందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లెల్సీ నీటినే దిగువన ఉన్న మంచినీటి చెరువులకు మళ్లించి మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. కలుషితం అయ్యో అవకాశం ఉండటంతో నిమజ్జనం చేసిన విగ్రహాలను తొలగించి నీటి శుభ్రతను కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో దాడి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నందవరం మండలానికి చెందిన కురువ ముద్ద రాముడు (27), తండ్రి సుగురప్పలపై అల్లుడు వలగోండ బాబు దాడి చేశాడని కురువ ముద్ద రాముడు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సీ ఐ శ్రీనివాసులు తెలిపారు. నందవరం మండలానికి చెందిన కురువ ముద్ద రాముడు అక్క లక్ష్మీ పోలీస్ స్టేషన్ సమిపంలోని యాపిల్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు స్కానింగ్ కొరకు రాగా లక్ష్మీకి తోడుగా వచ్చిన రాముడు, సుగురప్పలపై వలగోండ బాబు వెంట తెచ్చుకున్న రాడ్డుతో దాడి చేయగ్గా గాయాలయ్యాయని తెలిపారు. గోడవకు కుటుంబ కలహాలలే కారణమని, రాముడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డా అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పంచాయతీ రాజ్ శాఖ జయన్న పరిశీలించినట్లు కదిరికోట ఆదెన్న తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ డా అంబేడ్కర్ భవన నిర్మాణానికి 1.60 ఎకరాల భూమిని 2018లో ప్రభుత్వం కేటాయించింది. అందులో భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు నిధులు విడుదల చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా, పంచాయతీ రాజ్ శాఖను ఆదేశించడంతో శనివారం ఇంజనీరు జయన్న డాక్టర్ అంబేడ్కర్ భవన సాధన కమిటీ సభ్యులతో కలసి స్థలాన్ని పరిశీలించారు. రూ 50 లక్షల వ్యయంతో భవన నిర్మాణ చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు జయన్న తెలిపారు. ఆరు సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా భవన నిర్మాణం సాధ్యమైందని అన్నారు. భవన నిర్మాణ కొరకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయులు, ఎంపీ బస్తీపాటి నాగరాజును రూ.2 కోట్లు మంజూరు చేయాలని కొరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దేవ సహాయం, ఆనంద్, రుద్రాక్షల పెద్దయ్య, భాస్కర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.